

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

'**ద్వారకా నందన్**.. నా జీవితం నుండి శాశ్వతంగా దూరం అవుతున్నాడా? అతని గొంతు వినకుండా ఇన్ని రోజులు ఎలా వున్నానూ? ఈ కొత్త లైఫ్ స్టైల్, ఈ చదువూ, ప్రోజెక్ట్స్.. నాకు ఏడుపుని దూరం చేసాయి. మూవ్ ఆన్ అయిపోయానా? అతని జ్ఞాపకాలు కూడా నాలో తుడిచి పెట్టుకుపోతాయా?' ఇలా రకరకాలుగా ఆలోచించాను.

ఆ రాత్రి తెల్లవారుఝాముదాకా నిద్రపట్టలేదు. ఎర్రని కళ్ళతో లేచి, ఆలశ్యంగా వచ్చిపోతూ.. మబ్బుల మాటున దోబూచులాడ్తున్న సూర్యుడిని చూసి దణ్ణం పెట్టుకున్నాను. అలాంటి పనులు చేస్తున్నప్పుడు వసుంధర బాగా గుర్తొస్తుంది.

అమ్మా, నాన్నా, బామ్మా, నేనూ హనీష్ చేసే ఫోన్స్ కోసం ఎదురుచూస్తూ, టైముకి వాళ్ళ మందులు వేసుకుంటూ, సమయం అంతా దేనికో దానికి ఎదురు చూస్తూ గడిపేస్తుంటారా? టార్గెట్స్, పరీక్షలూ లేవు. ఆ రిటయిర్డ్ లైఫ్ రావడం కోసమే ప్రతి మనిషీ యంగ్ ఏజ్‌లో ఎంతో కష్టపడి ఆర్థిక సుస్థిరత ఏర్పాటు చేసుకుంటారు. ఇక్కడి కొచ్చే స్టూడెంట్స్‌లో చాలామంది మిడిల్ క్లాస్ బేరియర్‌ని ఛేదించాలనే సంకల్పంతో వచ్చే వారే! హనీష్.. ఎప్పుడూ ప్రివిలేజ్డ్, వాడికి ఏది అడిగితే అది చేసారు. అమ్మా నాన్నా అనుకునేదాన్ని. కానీ నేను అమ్మ వేసిన నేతి పెసరెట్లు తింటూ.. పచ్చడికి వంకలు పెట్టేట్టప్పుడు వాడు ఇక్కడ మాస్టర్స్ చదువుతూ, అమ్మా నాన్నలు పంపే డబ్బులు సరిపోక హోటల్‌లో పెద్ద పెద్ద గిన్నెలు తోమాడుట. హెవీ ట్రక్స్ నడిపాడుట. నా కన్నా చిన్నవాడు ఎంత బాధ్యతాయుతంగా ప్రవర్తించాడు? హూ! ఇంజనీరింగ్ వదిలేసి. అమ్మా నాన్నల ఆంక్షలనుండి బయటకొచ్చి, నా స్వాతంత్రం ప్రకటించుకుని, ఏదో సాధించానని గర్వంగా ఫీలయ్యాను. అన్నింటికీ వాళ్ళు ఏమీ అనకుండా, చిన్నపిల్ల. అదే తెలుసుకుంటుందిలే అని వదిలేసారు. అంత క్షమ నాకు ఎవరిమీదైనా వుందా? వుంటుందా? నీనాతో అనుభవం కూడా ఒక పాఠమే. జీవితంలో అందరూ అమ్మలా 'అన్నం తిన్నావా?' అని ఏ టైంలో ఫోన్ చేసినా అడగరు. నాన్నలా తన స్థోమతు చూసుకోకుండా డబ్బులు ఇవ్వరు. తోడబుట్టిన వాళ్ళలా అర్థం చేసుకోరు. దేవుడు అందుకే ఈ ప్యాకేజీతో భూమ్మీదకి పంపిస్తాడు. వాటిని మన ఎసెట్స్ అనుకుంటామా?

లేక బర్డెన్ అనుకుంటామా? అది మన కర్మకే వదిలేసాడు. అవి బ్యాంక్ బ్యాలెన్స్‌లాంటివి. ఎలా ఖర్చు పెట్టుకుంటామో కూడా మన తెలివిని బట్టి వుంటుంది. ఎప్పుడూ నిల్ అవని బ్యాలెన్స్ కన్నవాళ్ళ ప్రేమ.

ఫోన్ మోగుతుంటే తప్పకుండా గేరీనే అనుకుని వెళ్ళి చూసాను. అన్ నోన్ నెంబర్..."హలో" అనగానే "ఆకలేస్తోంది, ఏం వంట చేస్తున్నావు?" అని మగగొంతు... ఒక నిమిషం పోల్చుకోలేదు. కానీ మరుక్షణం.. "మేం ఎందుకు గుర్తువుంటాములే? కాబోయే సినిమా డైరెక్టర్‌కి" అని నవ్వు.

"ధీరజ్" అన్నాను ఆశ్చర్యంగా

"ఇవాళ ఆఫీస్ పనిమీద వచ్చాను ఇక్కడికి. యూ.ఎస్. వచ్చి వారం రోజులయిందిలే. ఎక్కడ వున్నావ్?" అన్నాడు.

"వాట్ ఏ ప్లెజెంట్ సర్‌ప్రైజ్...రా...రా..." అని, నా లొకేషన్ షేర్ చేసాను.

అప్పటిదాకా ప్రొటీన్ తాగి జిమ్ కి వెళ్దాం. బయటే ఏదో తినేద్దాం అనుకున్నదాన్ని, గబగబా బిసిబిలా బాత్‌కి ప్రిపరేషన్స్ చేసాను.

ధీరజ్ వచ్చాడు. బాగా చిక్కిపోయాడు. కానీ ఆనందంగా వున్నాడు. వస్తూనే నాకు షేక్‌హాండ్ ఇచ్చాడు. ఒక క్షణం ఆగి హగ్ చేసుకుని "యూ ఆర్ మై రియల్ ఫ్రెండ్" అన్నాడు.

"తాతయ్యా.. ఆంటీ ఎలా వున్నారు?" అడిగాను.

"అందరూ బావున్నారు" అన్నాడు.

"పరీని చూడకుండా వుండలేకపోయావ్ కదూ!" టీజింగ్‌గా అన్నాను.

"లేదు.. ఆఫీస్ పనిమీద వచ్చాను" అని నవ్వాడు.

"పద లంచ్ చేద్దాం" అన్నాను.

"రా...బ్రెడ్‌లు పీక్కు తిని తిని విసుగ్గా వుంది. అవును.. సీతా ఆంటీ వాళ్ళని చూడడానికి సియాటిల్ వెళ్దాం రాకూడదూ?" అన్నాడు.

"ఇప్పుడు కుదరదులే" అన్నాను.

అన్నింటికీ హనీష్ మీద ఆర్థికంగా ఆధారపడడం నాకు ఇష్టం లేదు. వీలైనంత పొదుపుగా వుంటాను. ప్రయాణాలు అవీ పెట్టుకోను. గేరీ పార్ట్ టైం ఏడ్స్ డైరెక్ట్ చెయ్యడం, స్క్రిప్ట్స్ రాయడం చేసి డబ్బు సంపాదిస్తాడు. నాకు అదీలేదు.

ధీరజ్ బిసీబిలాబాత్ తిని "వావ్! నిన్ను చేసుకోబోయేవాడు అదృష్టవంతుడు" అన్నాడు.

నాకు ఎందుకో కళ్ళనీళ్ళు వచ్చాయి.

ధీరజ్ నావైపు లోతుగా చూస్తూ "నువ్వు అడుగుతావని నేనూ.. నేను చెప్తానని నువ్వూ ఎదురు చూస్తున్నాం కాదూ.. ఆ టాపిక్" అన్నాడు.

"ఏ టాపిక్?" తెలిసీ తెలీనట్లు అడిగాను.

"ద్వారక గురించి" అన్నాడు.

"హూ! అతనికి నేను పాసింగ్ క్లౌడ్. జరిగిపోయాను" అన్నాను.

"జరిగిపోలేదు.. ఇదేం జరిగిపోయిన కథకాదు" నవ్వాడు.

నేను ప్రశ్నార్థంకంగా అతని వైపు చూసాను.

"మొన్న వచ్చేముందే హైద్రాబాద్‌లో కలిసాను. ఇద్దరం కలిసినప్పుడు, నీ గురించి ఎన్నో ప్రశ్నలు అడిగి తెలుసుకున్నాడు. హీ ఈజ్ హేపీ. నువ్వు యూ.ఎస్.లో ఒంటరిగా వుండి చదువుకుంటున్నందుకు" అన్నాడు.

"ఏం అడిగాడు?" అన్నాను.

"చదువుకుంటోందా? వాళ్ళ అమ్మా నాన్నలు చూసిన సంబంధం చేసుకుని, నా మీద కోపంతో ఎక్కడో కాపురం చేసుకుంటూ 'నయవంచకుడు' లాంటి నవల రాస్తోంది అనుకున్నానే అన్నాడు" అని ధీరజ్ నవ్వాడు.

ఎగ్జాట్లీ నాకు వచ్చిన ఆ ఆలోచనలు ద్వారక ఎలా చదివేసాడబ్బా? అనుకున్నాను.

"అతను నన్ను ఎన్నడూ సీరియస్‌గా తీసుకోలేదు. ఒక గర్ల్ ఫ్రెండ్ వస్తే కొన్నాళ్ళు ఎంజాయ్ చేసి వదిలేయచ్చులే... అన్నట్లే చూసాడు" అన్నాను.

"ఔనా?" ధీరజ్ లేచి వాష్ బేసిన్ దగ్గరకి వెళ్ళి "పాపం చాలా మిస్ అవుతున్నాడు" అన్నాడు.

అతను అటు తిరిగి చేతులు కడుక్కుంటూ ఆ మాట చెప్పకుండా, నా వైపు చూసి చెపితే ఎంత బావుండేది?

ఆతృతని అణుచుకుంటూ అతను టవల్‌తో చేతులు తుడుచుకుంటుంటే.. అబ్బా! తుడిచింది చాలు లే. ఇక్కడ రా. అందాం అనుకున్నాను.

అతను నావైపు తిరిగి "గేరీతో నువ్వు కలిసి వున్నావని కూడా అతనికి చెప్పాను" అన్నాడు.

బుస్సున నీళ్ళు జల్లినట్లు అయింది నా ఉత్సాహం మీద.

"ఏం అన్నాడు?" అన్నాను, ముందు రోజు రాత్రే అతనికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పి అతని మొహంలో మార్పులు చూడాలనుకున్నాను. కానీ ఇప్పుడు ఎందుకు చెప్పాడీ అసందర్భ ప్రలాపి అనిపించింది. మనసెంత చంచలం..

"చాలా ఆశ్చర్యపోయాడు మొదట్లో..తర్వాత. తను లైఫ్ గురించి తెలుసుకుంటుందిలే. ఐ యాం హెపీ ఫర్ హర్ అన్నాడు."

"వి ఆర్ జస్ట్ ఫ్రెండ్స్" కంగారుగా అన్నాను.

"ఓ.కే.." అని పకపకా నవ్వాడు ధీరజ్.

"ఎందుకు ధీరజ్ నవ్వు?" ఉక్రోషంగా అడిగాను.

"ఆ పిల్ల.. ఎవరితో వున్నా ఏదో రూం షేరింగ్ కోసం తప్ప. అంతకు మించి ముందుకు వెళ్ళలేదు" అని తనకి నమ్మకం అన్నాడు ద్వారక.

"ఎందుకో అంత నమ్మకం?" కోపంగా అన్నాను.

ద్వారక నా ముందు నిలబడి, హేళనగా నవ్వుతూ ఈ మాట అంటుంటే, నేను అతని మీద పడి, చెంపలు వాయిస్తూ ఎందుకంత హేళన?" అని అడగాలనిపించింది.

ధీరజ్ నా ముందు కూర్చుని "ద్వారకది అంత ఇరుకు మనస్తత్వంకాదు. అతను మనుషులని అంచనా వేసి మాట్లాడ్తాడు తప్ప. ఒక వేళ నీకు నీ రూమ్మేట్‌తో ఫిజికల్ రిలేషన్ వుంటే నిన్ను ద్వేషించడమో.. తప్పు పట్టడమో చెయ్యడు" అన్నాడు.

"అవును. బ్రాడ్ మైండెడేకాదు, బ్రాడ్ హార్టెడ్ కూడా. ఇప్పటికి ఒక పార్టనర్ని చూసుకునే వుంటాడు కదా!" అన్నాను.

"అది తెలుసుకోవాలనుందా?" అడిగాడు. అతని మాటలలో కవ్వింత వుంది.

నేను తట్టుకోలేనత ఉక్రోషంతో ఏడ్చేసాను.

నా ఏడుపు అయ్యేదాకా ధీరజ్ డిస్టర్బ్ చెయ్యలేదు.

"అయిందా?" అడిగాడు.

నేను టిష్యూతో కళ్ళు తుడుచుకుంటూ, "నీ ఫ్రెండ్‌కి నేను ఓ టిష్యూ పేపర్‌తో సమానం కదూ" అన్నాను.

"వాళ్ళ మదర్‌కి ఈ మధ్య హెల్త్ ఇష్యూస్ వచ్చాయి. అందులోనూ, తన బిజినెస్‌లో పార్టనర్ మోసం చేసాడు. ఆ విషయాలలోనూ బిజీగా వున్నాడు. ఆ టెన్షన్స్‌లో ఇంకో గర్ల్ ఫ్రెండ్‌ని వెతుక్కుని వుంటాడని అనుకోను. అఫ్‌కోర్స్ అతను నిన్ను మిస్ అవుతున్నానని నాతో రెండుసార్లు అన్నాడు అంటే హీ మీన్స్ ఇట్.." అన్నాడు.

సెల్‌ఫోన్ తీసి "చూడు తను ఎలా వున్నాడో?" అన్నాడు.

ఆతృతగా చూసాను.

ధీరజ్ పక్కనున్న ద్వారక గెడ్డం పెంచి వున్నాడు. ఆ గెడ్డంలో నెరిసిన చిరు తెల్ల వెంట్రుకలు కనబడ్తున్నాయి. ఆ కళ్ళల్లో ఏదో మిస్సింగ్. ఉత్సాహంగా ఉల్లాసంగా లేదు. లేదా? ఉండకూడదని నా విష్‌ఫుల్ థింకింగ్ అనుకుంట.

కొంచెం సేపు అలాగే తీక్షణంగా చూసి, "నాకు పంపించు" అన్నాను.

"నీ దగ్గర అతని ఫోటోస్ లేవా?" ధీరజ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"అన్నీ డిలీట్ చేసాను" అన్నాను.

"సో.. మరిచి పోలేక పోతున్నావు అనమాట" అన్నాడు.

నేనేం అనలేదు.

"మరిచిపోలేనప్పుడే ఇలాంటివి చేస్తారు" అన్నాడు.

"అయితే ద్వారక డిలీట్ చేసి వుండడు" అన్నాను.

ధీరజ్ నవ్వి "అతను పిచ్చివాడు అయిపోయాడు నీ జ్ఞాపకాలతో" అని చెపితే నువ్వు ఆనందపడ్తావేమోగానీ అలా మగవాళ్ళు చెయ్యరు. వేరే పనుల్లో బిజీ అయిపోతారు. అలా అని బాధ వుండదు అనుకోకండి. నేను పరి ఇంకో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నదని తెలిసి తట్టుకోలేకపోయాను. కానీ ఉద్యోగం, కుటుంబ బాధ్యతలూ, వ్యవసాయం, ఏదీ మానలేదు. కాలో చెయ్యో తీసేసినా మనిషి మిగతా అవయవాలతో బ్రతికేసినట్లు" అన్నాడు.

"నేను కాలా? చెయ్యా? కనీసం వేలా?" అడిగాను.

"ఇది... ఇది ఎక్స్‌పెక్ట్ చేస్తాను రుష్యేంద్రమణి నుండి ఈ స్పాంటేనిటీ" అన్నాడు ధీరజ్.

"నీ ఫ్రెండ్‌ని కలిస్తే చెప్పు. నేనూ బాగానే వున్నానని. వెనీలా ఐస్‌క్రీంనీ, ఆలూ ఫ్రైనీ, బంగినపల్లి మావిడి పండునీ నా లైఫ్ నుండి మైనస్ చేసేసినా వేరేవి తిని బతికేస్తా అని" అన్నాను.

"వావ్! సో.. నీకు ద్వారక ఇవన్నీనా? ఎంత బాగా పోల్చావూ?" అన్నాడు.

"మీ పెళ్ళెప్పుడు?" టాపిక్ డైవర్ట్ చేసాను.

"అందుకే సియాటిల్ వెళ్తున్నాను, పరీ వస్తానంది. డివోర్స్ ఈ వీక్‌లో వస్తుందిట. లాయర్ చెప్పారుట. ఆంటీ అంకుల్‌తో మాట్లాడి ముహూర్తాలు పెట్టిస్తా.. అప్పుడైనా వస్తావా?"

"వస్తా" చెప్పాను.

"ఇక్కడ రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుని, ఇండియాలో అమ్మా, తాతయ్యా దగ్గర ట్రెడిషన్‌ల్ మ్యారేజ్ చేసుకుంటాం" అన్నాడు.

"జూన్ తర్వాత చేసుకో. నా ఎగ్జామ్స్ అయిపోయి ఇండియా వస్తాను" అన్నాను.

"పరీని అడుగు.. తన ఇష్టం" అన్నాడు.

"నిన్ను ఇలా సంతోషంగా చూస్తుంటే చాలాబావుంది" అన్నాను.

"ఆ సంతోషం కోసమేగా మా ఊరు వెతుక్కుంటూ వచ్చావు. అందుకే రాగానే హగ్ చేసుకున్నది" అన్నాడు.

ఈవినింగ్ ధీరజ్ వెళ్ళేముందే గేరీ వచ్చాడు. ఇద్దరికీ పరిచయాలు చేసి నేను టీ పెట్టడానికి వెళ్ళాను.

గేరీ పెద్దగా నవ్వడం వినిపించింది. ధీరజ్ చాలా ఇంట్రావర్ట్‌గా వుండేవాడు, ఇప్పుడు ఆనందంలో చాలా మాట్లాడ్తున్నాడు అనిపించింది.

ధీరజ్ వెళ్ళిపోయాకా, సియోటిల్ వెళ్ళి వుండాల్సిందా? అని ఆలోచించాను.

ఆ పరిసరాలూ, జ్ఞాపకాలూ ఎందుకు మళ్ళీ తడుముకోడం. చెక్కిలిమీద నుండి రెండు కన్నీటి బొట్లు జారిపడ్డాయి. అతను నాకు ఓ మరుపురాని మధుర జ్ఞాపకంలా మారిపోనున్నాడా?

"అతను నిన్ను మరిచిపోలేదు" అన్న ధీరజ్ మాట ఆనందాన్నిచ్చింది. కానీ మరిచిపోడమేమిటి? అసలు మరిచిపోడానికి అంత చిన్న పరిచయమా? ఎందుకు మనసుకి ఇంత అల్పసంతోషిత్వం?

జూన్‌లో పరీక్షలవగానే ఇండియా వెళ్దాం అనుకున్నాను. కానీ జనవరిలోనే వెళ్ళాల్సి రావడం అనూహ్యం. మరి జీవితం అనే గారడీవాడి పెట్టెలోంచి ఎప్పుడేం బయట పడ్తుందో తెలీదుగా..

అమ్మకి హిస్ట్రెక్టమీ చెయ్యాల్సిన అవసరం రావడంతో నేను, వెనుకా ముందూ ఆలోచించకుండా టికెట్ కొనేసుకున్నాను.

హనీష్ అప్పటికీ "నేను వెళ్తాలే.. నీకు ఇప్పుడు ప్రాక్టికల్ ఎగ్జామ్స్ వుంటాయిగా" అన్నాడు.

"అత్తయ్య కోసమే హడావిడిగా పంపేసారు నాన్న. అలాంటిది అమ్మకోసం వెళ్ళకపోతే ఎలా? ఆమెకి ఎవరు చేస్తారు? ఏ ప్రియంవద పెద్దమ్మో వచ్చినా ఎంతసేపూ తన సంసారం విడిచి పెట్టి వచ్చానన్న బాధే వుంటుందిగా. నన్ను వెళ్ళనీ" అన్నాను.

అమ్మని తలుచుకోగానే, అమాయకంగా కూనిరాగాలు తీసుకుంటూ వంటింట్లో పడి వంట చేసుకోవడమో, తనతో బాటు నాకు తన తరం ఇష్టాలు, భావాలూ, పాత సినిమాలూ అలవాటు చేసెయ్యడం. అన్నీ తనకి తెలుసు అనే అమాయకత్వంలో యాభై ఏళ్ళు బ్రతికెయ్యడం ఆశ్చర్యమనిపిస్తుంది.

తెలతెలవారుతుండగా, పారిజాతాలు నేలంతా రాలి నిన్నటి రాత్రి కన్నెపిల్లలు కన్న కలల్ని గుర్తు తెస్తుండగా వెన్నెలమ్మ వెళ్ళి వేకువమ్మ ఎప్పుడొచ్చిందా అని వెలుగుకి ఆశ్చర్యపోతూ, కోయిలమ్మ 'కుహూ కుహూ' అని రాగాలు ఆలపిస్తుండగా, పాలపాకెట్ల క్రేట్‌లతో వెళ్ళే ట్రక్ లు తప్ప ఇంకెవరూ నిద్రలేపని రోడ్డు కొండ చిలువలా బద్ధకంగా పడుకుని వుండగా దాని మీద రయ్యమని వెళ్తున్న క్యాబ్‌లోంచి కిటికీ కొద్దిగా తెరిచి, నా ఊరు గాలిని తాకి.. ఓసారి చెయ్యిజాపి ఆ పిల్ల తెమ్మెరలని పలకరించాను. రాంకీ బండి మీద వెన్నదోశా, యాషికతో తాగిన ఇరానీ చాయ్‌లూ, వీధి మొదట్లో నిద్రగన్నేరూ, ఇంటిముందు జూకా మందారం. అన్నింటినీ ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ నేనింతగా మిస్ అయ్యానా అని ఆశ్చర్యపోతూ కాలింగ్ బెల్ మోగించాను. అప్పుడే ఐదు అవుతున్నట్లుంది నానమ్మ లేచి వుంటుంది.

మరుక్షణంలో వసుంధర తలుపు తెరుస్తుంది అని ఎదురు చూస్తుండగా, నాన్న తలుపు తెరిచారు "నువ్వా... రిషీ?" అని ఆనందంగా అరిచారు. అంతలోనే కళ్ళనిండా నీళ్ళతో "వసూ...వసూ..ఎవరొచ్చారో చూడూ" అన్నారు.

"ఎవరూ?" అంటూ అమ్మ నెమ్మదిగా బయటికి వచ్చింది.

నేను గబుక్కున గుర్తే పట్టలేదు. అంత బలహీనంగా వుంది. కళ్ళకింద డార్క్ సర్కిల్స్. చాలా వయసు మీద పడ్డదానిలా వుంది.

"రిషీ ఎప్పుడొచ్చావే?" అంది.

"నిన్నే వచ్చి మెట్లకింద దాక్కున్నానమ్మా" అని జోక్ చేసాను.

నా వీపు మీద ఒక్కటిచ్చింది.

"తలకి రంగెయ్యలేదా వసూ!" ప్రేమగా అడిగాను.

అమ్మ నవ్వి "నాన్నే ఇంత వుడకేసి పెడ్తున్నారు. ఒక వంటమనిషిని పెడితే, నానమ్మ ఆరోగ్యం పూర్తిగా పాడయిపోయింది ఆ వంటకి" అంటూ ఇంట్లోకి నడిచింది.

"ఔను నానమ్మ ఇంకా లేవలేదా?" అని అవిడ గదిలోకి పరిగెత్తాను.

నానమ్మ ఇంకా పడుకునే వుంది.

మొదటిసారిగా ఆ ముగ్గురు వృద్ధుల్లో ఒక నైరాస్యం.. నిర్లిప్తతా గమనించాను.

"నానమ్మా ఏమైంది? ఎలా వున్నావ్? నీ రామయ్య ఐదింటికే అలారం కొట్టినట్లుగా రామకోటి రాయమని లేపుతాడుగా" అన్నాను.

ఆవిడ నెమ్మదిగా కళ్ళు తెరిచి దెయ్యాన్ని చూసినట్లు చూస్తోంది.

"రిషీ..తల్లీ" అంది. వెంటనే బావురుమని ఏడుపు మొదలుపెట్టింది.

"నానమ్మా" అనగానే లేచి నన్ను చుట్టుకుపోయి "నువ్వు లేని ఇల్లు, ఇల్లులా లేదే. అసలు నువ్వు వెళ్ళినప్పటినుండీ ఇల్లు ఆసుపత్రిలా తయ్యారయిందే. వసుంధరకి ఏమైందో తెలీదు నిలబడి నిలబడి పడిపోతోంది."

"అమ్మా.. అది ఇప్పుడే వచ్చింది" అని నాన్న ఆపబోయారు.

"మీ నాన్నకి మొన్న బండి మీదెళ్తుంటే సడెన్‌గా గుండె నొప్పి వచ్చింది. ఆస్పత్రిలో ఓ రోజంతా ఎడ్మిట్ అయ్యాడు. ఆ అబ్బాయి దేవుడులా వచ్చాడు" ఆవిడ ప్రవాహానికి అడ్డు వెళ్తూ "నాన్నా ఇవన్నీ ఎందుకు చెప్పలేదు?" అన్నాను.

"అంత దూరాన వున్న పిల్లలకి ఇలాంటివి ఎవరైనా చెప్తారా?" అంది అమ్మ.

"మరి మాకెలా తెలుస్తుంది? అసలు హనీష్ కైనా తెలుసా? మీరు బండి నడపొద్దు కేబ్‌లో తిరగమని చెప్పానా లేదా? ఫోన్ చేస్తే అంతా బావున్నామని ఎందుకు అబద్ధాలు చెప్పారూ?" కోపంగా అరిచాను.

అమ్మ నన్ను దగ్గరకి తీసుకుంది. ఆవిడకూడా ఏడుస్తోంది. "నువ్వు వచ్చి మంచి పని చేసావు. రాత్రంతా నిన్ను చూడకుండానే పోతానేమో అని ఏడ్చానే" అంది.

"రిషీ! నీ గొడవా...అల్లరీ లేని ఇల్లు మాత్రం నిజంగా ఇల్లులా లేదమ్మా" అన్నారు నాన్న.

"కూరలో ఉప్పు తక్కువైందనీ..దోశ మాడిపోయిందనీ.. నామీద కేకలేసే వారే లేరే" అమ్మ ఏడుస్తోంది.

"ఇవేనా నా గురించి స్వీట్ నథింగ్స్? ఇంకేం లేవా గుర్తుచేసుకోడానికి?" సీరియస్‌గా అడిగాను.

అందరూ నవ్వేసారు.

"ముందు మొహం కడుక్కుని, ఫ్రెష్ అయిరా రోజు మొత్తం ప్రయాణం. కాఫీ ఇస్తాను" అంది అమ్మ.

"ఇంక ఆ స్టో డ్యూటీ నాకివ్వు చేసింది చాలుగానీ" అన్నాను.

పెరట్లో కాశీరత్నం తీగ పిచ్చిపిచ్చిగా చిన్న పిల్లల పలకమీద రాతలా అల్లుకుపోయి వుంది. గులాబీ మొక్కలన్నీ శుశ్రూష లేక ఎండిపోయి వున్నాయి. గడ్డిమొక్కలు పనిలేని మెదడ్లో పిచ్చి ఆలోచనల్లా ఈ ఎత్తున మొలిచి వున్నాయి. అమ్మ స్విచ్ బోర్డ్‌లు తళతలా మెరిసేట్లు తుడిచేది. అన్నీ మసి బారాయి. ఫ్యాన్ నాగదిలో గరగర శబ్దం చేస్తూ తిరుగుతోంది.

నా మంచం మీద మాత్రం ఉతికి ఇస్త్రీ చేసిన పూల దుప్పటి పరిచి వుంది.

నిస్సారంగా అన్నట్లు వుంది ప్రతి వస్తువూ.

అమ్మ కాఫీ కలిపి తీసుకొచ్చింది.

ఆమె చెయ్యి పట్టి దగ్గరకి తీసుకున్నాను. నా భుజం మీద తల వాల్చింది. పుట్టి బుద్దెరిగాక నేనెన్నడూ చెయ్యని పని చేసాను.

"ఐ యాం సారి వసూ! నిన్ను చాలా కష్టపెట్టాను. డిఫికల్ట్ చైల్డ్‌ని పెంచావు. నీకు అభినందనలు" అన్నాను.

అమ్మ నవ్వింది. కానీ కన్నీళ్ళే వచ్చాయి.

నానమ్మ అంది "నిన్ను తలుచుకోని నిమిషం లేదే అమ్మ" అని.

అమ్మకి హనీష్ అంటేనే ఎక్కువ ప్రేమ అనుకునేదాన్ని. కంటికి ఎదురుగా లేకపోతే తలచుకుంటుంది అనమాట.

"నానమ్మా.. ఇందాకా ఆ అబ్బాయే లేకపోతే నాన్న హాస్పిటల్‌లో ఎడ్మిట్ అయినప్పుడు కష్టం అయ్యేది అన్నావ్. ఎవరా అబ్బాయి?" అన్నాను.

"ద్వారక" అన్నారు నాన్న.

నాకు కాఫీ గుటకపడలేదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS